## క్లుప్తంగా

### సత్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ ఆవరణలో విశ్రాంత ఉపాధ్యాయుడు జక్కుల గజ్జారాం తన కుమారుడు వేణు స్మారకార్థం, భక్తుల కోసం రూ.5 లక్షలతో సత్రం నిర్మించారు. కాగా మంగళవారం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు సత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జుట్టు సుధాకర్, గోపీచంద్, రమేశ్‌గౌడ్, కృష్ణారావు, పండరి, తాటి శివ తదితరులు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో ఫ్యాన్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో పట్టణంలోని బస్టాండ్‌లో ఫ్యాన్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 8న ‘ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి’శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఫ్యాన్లకు మరమ్మతు చేయించి ఏర్పాటు చేయించారు. కుభీర్ పాయింట్ వద్ద ఫ్యాన్లు బిగించి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించారు. అలాగే తాగునీటి కోసం వాటర్ కూలర్ ఏర్పాటు చేసినట్లు డీఎం అమృత తెలిపారు.

### చలివేంద్రం ప్రారంభం

కుంటాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాల బస్టాండ్ ఆవరణలో జుట్టు వారి పరివారం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్సై వి.రజనీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, జుట్టు లక్ష్మణ్, జుట్టు మహేందర్, గణపతి, దేవేందర్, దయాకర్, సోమశంకర్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ‘కార్పొరేట్లకు అండగా కేంద్రం’

కడెం: కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ.. బడుగు, బలహీన వర్గాలను విస్మరిస్తుందని నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గె వెంకటేశ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

### గిరిజన మోర్చా నియోజకవర్గ అధ్యక్షుడిగా గులాబ్



గులాబ్‌కు స్వీట్ తినిపిస్తున్న నాయకులు

కుభీర్: మండలంలోని రంజనితండాకు చెందిన రాథోడ్ గులాబ్‌ని ముధోల్ నియోజకవర్గ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షులు ఏశాల దత్తాత్రి తెలిపారు. మంగళవారం ఆయనను కుభీర్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పి.గంగాధర్, వి.నాగేష్, నర్సప్ప, కనకయ్య, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

### ‘కేసీఆర్‌ది పొలిటికల్ డ్రామా’

ఖానాపూర్: రైతుల సమస్యల పేరిట మాజీ సీఎం కేసీఆర్ పొలిటికల్ డ్రామా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కే సీ ఆర్ పాలన విసిగెత్తిన రైతులే బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పట్టిన గతే పార్లమెంట్ ఎన్నికల్లోనూ తప్పదని పేర్కొన్నారు.

### లక్ష్మీనరసింహుడికి పూజలు

కడెం: క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ నేపథ్యంలో మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలోని శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు స్వామివారికి స్వప్నతిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, అష్టోత్తరపూజలు చేశారు. అనంతరం పంచాగ శ్రవణం పఠించి భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదం అందజేశారు.

### ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ప్రారంభం

భైంసా: ఉగాది పర్వదినం సందర్భంగా బాసరలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖను ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రోజు ఉదయం 6 నుంచి ఏడు గంటల వరకు శాఖ కొనసాగుతుందన్నారు. వేసవి సెలవుల్లో ఆర్‌ఎస్‌ఎస్ శాఖకు పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి సాయినాథ్ పటేల్, బీజేపీ మండలాధ్యక్షులు కిశోర్‌దేశాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకలు



కుంటాల: కల్లూర్ సాయిబాబా ఆలయంలో పంచాంగ శ్రవణం



లోకేశ్వరంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న యువకులు



తానూరు: నందగాంలో చేనులో అరకతో రైతు



భైంసాటౌన్: పురాణబజార్ రాధాకృష్ణ భవన్‌లో..

జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉగాది(తెలుగు సంవత్సరాది) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇళ్లను మామిడి తోరణాలు, పూలతో అలంకరించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈఏడాది పంటలు సమృద్ధిగా పండటంతోపాటు పశుసంపద బాగుండాలని మొక్కుకున్నారు. పలు చోట్ల వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. రైతులు పంట చేన్లకు వెళ్లి అరక దున్ని నూతన వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఇళ్లకు వచ్చి షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని సేవించారు. నిర్మల్‌లో విశ్వ హిందూ పరిషత్, హిందూ వాహిని, బుధవార్‌పేట మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పాతబస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో పురోహితులు లక్ష్మీ నరసింహమూర్తి, కళాకారుడు వరంగల్ శ్రీనివాస్, ఉగాది ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ సుహాసిని నాట్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భైంసాలోని శివాజీచౌక్‌లో హిందూవాహిని మహిళ శాఖ ఆధ్వర్యంలో, పురాణబజార్ రాధాకృష్ణభవన్‌లో మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో పండుగ వేడుకలు నిర్వహించారు. ఖానాపూర్‌లోని శ్రీరాంనగర్ హనుమాన్ ఆలయంలో నూతన సంవత్సరంలో రాశిఫలాలు చదివి విన్పించారు. ఉద్యోగ, వ్యాపారం, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు పండుగకు సొంత ఊళ్లకు రావడంతో గ్రామాలు సందడిగా మారాయి. - సాక్షి నెట్‌వర్క్



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో రామాలయం వద్ద పందిరి వేస్తున్న గ్రామస్తులు



దిలావర్‌పూర్: మాడేగాంలో చేను వద్ద రైతులు



ముధోల్‌లో చైతన్య యూత్ ఆధ్వర్యంలో..



కుంటాల : విఠాపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న రైతులు



భైంసారూరల్: ఖథ్‌గాంలో చేను వద్ద కుటుంబసభ్యుల సందడి



కుభీర్ శివాలయంలో..



సోన్: న్యూవెల్మల్‌లో పంచాంగం వింటున్న గ్రామస్తులు



నిర్మల్‌లో బోయివాడ హనుమాన్ ఆలయం వద్ద పచ్చడి పంపిణీ చేస్తున్న హిందూ వాహిని సభ్యులు



ఖానాపూర్‌లోని శ్రీరాంనగర్ హనుమాన్ ఆలయంలో పంచాంగం వింటున్న యువకులు

# ప్రజలంతా సంతోషంగా ఉండాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: నూతన సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు, రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, తూమోల్ల దత్తాత్రి, కౌన్సిలర్ గౌతంపింగ్లే, వడ్నం శ్రీనివాస్, రామకృష్ణాగౌడ్, మున్నా లడ్డా, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.



పచ్చడి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్

**చలివేంద్రం ప్రారంభం**

భైంసాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో 10వ వార్డు కౌన్సిలర్ రావుల సువర్ణ పోశెట్టి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాధర్, రమేశ్, గంగారెడ్డి, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, కౌన్సిలర్ గౌతం పింగ్లే, సాహెబ్‌రావు తదితరులు ఉన్నారు.

**కామోల్‌లో ప్రారంభమైన ఉత్సవాలు**

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో మంగళవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నవరాత్రుల సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో రామాయణ పారాయణం, జ్ఞానేశ్వరి పారాయణం, అఖండ హరినామ సప్తాహం నిర్వహించనున్నందున భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆలయంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, రైతులు ప్రత్యేక పూజలు చేశారు.

# శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం సట్ల నారాయణ ఇంటి నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో డప్పుచప్పుళ్ల నడుమ, రామనామ సంకీర్తనలు ఆలపిస్తూ ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, అఖండ ద్వీప ప్రజ్వలన చేశారు. 10న గణపతి పూజ, పుణ్య హవచనం, ఆలయశుద్ధి, యజ్ఞశాలప్రవేశం, అంకురారోపణ, రుత్విక్ వరణం, యజ్ఞదీక్ష, యోగిని స్థాపనం, సర్వతోభద్ర పూజ, 16న విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకం, కర్మణాపుణ్యాహవచనం, సుదర్శన నర్సింహ సీతారామచంద్ర మూలమంత్ర హోమాలు, హనుమాన్, పంచాయతన మూలమంత్ర హోమాలు, 17న గణపతి పూజ, విశేష పంచామృతాభిషేకం, సీతారామచంద్ర పరబ్రహ్మ తులసీ సువాసన పుష్పాలతో అర్చన నిర్వహించనున్నారు. తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణ అనంతరం కల్యాణ మహోత్సవం, అన్నదానం ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



ఉత్సవమూర్తులతో భక్తులు

### ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉగాది

కుభీర్: మండల కేంద్రంలో మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ కుభీర్‌శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. విభాగ్ కుటుంబ ప్రమోదక్ ప్రముఖ్ సరికొండ దామోదర్ మాట్లాడుతూ విజయదశమి రోజున ఐదుగురితో స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్.. ప్రస్తుతం 200 అనుబంధ సంఘాలతో 174 దేశాల్లో సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో సంస్థ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఐదు అంశాలపై దృష్టి సారించిందన్నారు. సామాజిక సామరస్యత, కుటుంబవ్యవస్థను ప్రోత్సహించడం, పౌరుల బాధ్యతలు, బీదరికం, ఉపాధి కల్పనకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రచారక్ అనంతసాయి, పోశెట్టి, శ్రీనివాస్, శివలింగం, గంగయ్య, వెంకటి తదితరులు ఉన్నారు.

# గంగన్న సేవలు అభినందనీయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: కొన్నేళ్లుగా వేసవిలో రహదారి వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్న మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ బస్టాప్ వద్ద గంగన్న ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, రాజేశ్, భూషణ్ ఉన్నారు.

**ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఎమ్మెల్యే**

ఖానాపూర్: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు యూసుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక అంగడిబజార్ చౌరస్తాలో మంగళవారం రాత్రి ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తదితరులు హాజరయ్యారు. అనంతరం జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, జహీర్ అహ్మద్, ముషీర్, సలీంఖాన్, ఆసీఫ్‌అలీ, గంగనర్సయ్య, సతీశ్‌రెడ్డి, రియాజ్, స్వప్నిల్ పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

**ఎమ్మెల్యేకు ఆహ్వానం**

పెంబి: మండల కేంద్రంలోని హరిహర ఆలయ వార్షికోత్సవం ఈనెల 11 నుంచి 13వరకు నిర్వహించనున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను కలిసి ఆహ్వానపత్రిక అందించి వేడుకలకు రావాలని కోరారు. కాంగ్రెస్ పెంబి మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, శంకర్, దయానంద్ ఉన్నారు.

### సన్మానం

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ మైనార్టీ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులైన షబ్బీర్‌పాషాను జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు యూసుఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మై నార్టీ సెల్ మండలాధ్యక్షుడు సలీంఖాన్, పట్టణాధ్యక్షుడు షౌకత్‌పాషా, ఆసిఫ్ అలీ, జహీర్, మీర్జాబేగ్, ముషీర్ తదితరులు ఉన్నారు.

### రాంజీగోండు వర్ధంతి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలోని గంగాయిపేట్‌లో మంగళవారం రాంజీగోండు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు ఆధ్వర్యంలో రాంజీగోండ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జుగునాక లక్ష్మణ్, దుర్వ మానుకు, ఆత్రం జైత్రి, భారతి, లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

### పరామర్శ

నిర్మల్‌టౌన్: లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన సిటీ కేబుల్ డిష్ ఆపరేటర్ బి.గోపి ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి గోపిని పరామర్శించారు. వారి వెంట పాకాల రాంచందర్, అనుముల భాస్కర్, పద్మనాభం తదితరులు ఉన్నారు.

## నూతన కార్యవర్గాలు

కుంటాల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కుంటాలలో మంగళవారం మున్నూరు కాపు పటేల్, రజక సంఘం కార్యవర్గాలను ఆయా సంఘా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు పటేల్ సంఘ గ్రామాధ్యక్షుడిగా తోట రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శిగా మాగామ నాగరాజు, కోశాధికారిగా సీపతి వివేకానంద్ ఎన్నికయ్యారు.

రజక సంఘం గ్రామాధ్యక్షుడిగా అరిగెల శంకర్, ఉపాధ్యక్షుడిగా ఎల్ల సురేశ్, కోశాధికారిగా కాశీరాం సదాశివ్, రైటర్‌గా కల్యాణ్ ఎన్నికయ్యారు.

**సారంగపూర్‌లో రెడ్డి సంఘం..**

సారంగపూర్: మండలకేంద్రంలో రెడ్డి సంఘం గ్రామ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. సంఘం గ్రామాధ్యక్షుడిగా పదిరె లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గట్టుమీది రాజారెడ్డి, కోశాధికారిగా ననిగంటి లింగారెడ్డి, ఉపకోశాధికారిగా గట్టుమీది చిన్నారెడ్డి, రైటర్‌గా పెద్దోళ్ల చిన్నారెడ్డి, సమాచార సభ్యులుగా ప్రభాకర్‌రెడ్డి, చిన్న పోతి రాము, సభ్యులుగా నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్యాంరెడ్డి, నరేశ్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

**పొట్టపెల్లి(కే) వీడీసీ..**

లక్ష్మణచాంద:మండలంలోని పొట్టపెల్లి(కే)లో మంగళవారం నూతన వీడీసీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులుగా చించోలి మోహన్, ఎంగులు, జడ్డి శ్రీనివాస్, చిన్న భోజన్న, చిన్న మల్లైన్న, నడిపి భోజన్న, గంగాధర్, సాయన్న, పి.సాయన్నను ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన సభ్యులు పేర్కొన్నారు.

**బాసరలో శ్రీకృష్ణ యాదవ సంఘం కమిటీ..**

భైంసా: బాసరలో శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కమిటీ గౌరవ అధ్యక్షులుగా జిడ్డు మల్లయ్యయాదవ్, అధ్యక్షుడిగా జిడ్డు సుభాశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా హరిదాస్‌యాదవ్, కోశాధికారిగా బాల నడిపి పోతన్నయాదవ్, కార్యదర్శిగా జిడ్డు విలాస్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా బొట్టే శ్రీకాంత్‌యాదవ్, సాంస్కృతిక కార్యదర్శిగా జిడ్డు సంజీవ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

### ‘వ్యక్తిగత దూషణ సరికాదు’

భైంసాటౌన్: తనపై ముధోల్ ఎమ్మెల్యే వ్యక్తిగత దూషణ చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు జి.విఠల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ కాల్వ ద్వారా చివరి తడికి నీరందించలేదని తనపై ఆరోపణలు చేశారన్నారు. అయితే గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి సాగునీటితోపాటు మిషన్ భగీరథ కింద గ్రామాలకు తాగునీటిని వినియోగించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఫలితంగా ఏటా రబీ(యాసంగి) సీజన్‌లో సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ విషయమై గతంలో తాను ఎమ్మెల్యేగా పలుమార్లు ప్రభుత్వం దృష్టికి, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కనకాపూర్, పిప్రి ఎత్తిపోతల విషయమై కూడా అసత్య ఆరోపణలు చేశారని.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

### అటెన్షన్ ప్లీజ్.. వీధిదీపాల వెలుగులేవి..?



నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి పెట్రోల్‌బంక్ వరకు గ్రామపంచాయతీ నిధులు రూ.53 లక్షలతో డివైడర్ మధ్యలో 44 స్తంభాలకు ఇరువైపులా ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 15 వరకు ఎల్‌ఈడీ బల్బులు వెలగడం లేదు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని.. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్‌గౌడ్, నర్సాపూర్(జి) స్పెషల్ ఆఫీసర్, ఫోన్: 94403 11142